క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం గురువారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ బుధవారం తెలిపారు. ఈతకోట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మండలంలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మిపోలవరం, పొడగట్లపల్లి, దేవరపల్లి, మట్టలదొడ్డి, కేతరాజుపల్లి, చెల్లిరేవు, వెదిరేశ్వరం, కోసూరి నగర్, గరువు ప్రాంతాలకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

మామిడికుదురు: సముద్ర తీరంలోని కరవాక గ్రామం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సీజ్ చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నారంటూ మంగళవారం రాత్రి వచ్చిన ఫిర్యాదు మేరకు వీఆర్వోలు కమలాకర్, నారాయణ, సుబ్బరాజు, పోలీసులు దాడి చేశారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి మండల రెవెన్యూ కార్యాలయానికి తీసుకువచ్చారని తహసీల్దార్ మృత్యుంజయరావు బుధవారం తెలిపారు.

ప్రజల నిరసన



నిరసన తెలుపుతున్న స్థానికులు

మామిడికుదురు: పాశర్లపూడిబాడవలో స్థానికులు బుధవారం రైల్వే వాహనాలను అడ్డుకుని నిరసన తెలిపారు. రైల్వే క్రాంట్రాక్టర్‌కు చెందిన భారీ వాహనాల రాకపోకలతో పంచాయతీ రోడ్లు పాడైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్లను తమ అవసరాలకు వాడుకోవడం తప్ప వాటి అభివృద్ధిని పట్టించుకోవడం లేదంటూ నిరసన తెలిపారు. గతంలో రైల్వే కాంట్రాక్టర్ రోడ్డును అభివృద్ధి చేస్తామంటూ ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. రహదారులను అభివృద్ధి చేసే వరకూ ఈ వాహనాలను పంచాయతీ రోడ్లపై తిరగనిచ్చేది లేదని స్పష్టం చేశారు.

రచనలు ప్రశంసనీయం



కలెక్టర్‌కు పుస్తకం అందిస్తున్న ప్రతాప్

సఖినేటిపల్లి: సామాజిక ఇతివృత్తాలతో రచనలు చేస్తున్న కవి, రచయిత కత్తిమండ ప్రతాప్ ప్రశంసనీయుడని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. బుధవారం అమలాపురంలో కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను ప్రతాప్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల విడుదల చేసిన ట్రాన్స్‌జెండర్ లైఫ్ స్టోరీ స్వీయ రచనను కలెక్టర్‌కు ఆయన అందజేశారు. అలాగే పలు స్వీయ రచనలను కూడా కలెక్టర్‌కు ప్రతాప్ ఇచ్చారు.

పారదర్శకంగా సామాజిక తనిఖీ చేయాలి

అంబాజీపేట: ఉపాధి హామీ పథకంలో పనులపై సామాజిక తనిఖీ పారదర్శకంగా చేయాలని ఎంపీడీవో జి.సరోవర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆయా గ్రామాల్లో నిర్వహించే సామాజిక తనిఖీపై సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, ఉపాధి పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఆడిట్ సిబ్బందితో బుధవారం సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో రూ.9.71 కోట్లతో పనులు నిర్వహించారన్నారు. వీటిపై ఈ నెల 11 నుంచి 19 వరకు సామాజిక తనిఖీ జరుగుతుందన్నారు. ఉపాధి హామీ ఏపీఓ అడపా వెంకటకృష్ణ, ఈఓపీఆర్డీ బి.మమత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పండుగగా ప్రకటించాలి

అంబాజీపేట: జిల్లాలో సంక్రాంతి మర్నాడు కనుమ రోజున జరిగే ప్రభల ఉత్సవాన్ని కూడా రాష్ట్ర పండుగగా ప్రకటించాలని ఏకాదశ రుద్రుల నిర్వాహణ కమిటీ సభ్యులు కోరారు. మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో 400 ఏళ్ల నుంచి ఎంతో వైభవంగా జరుగుతున్న ప్రభల ఉత్సవాన్ని కూడా రాష్ట్ర పండుగగా గుర్తించాలని అన్నారు.

దౌర్జన్యంపై కేసు నమోదు

అంబాజీపేట: ఓ మోటారు సైకిలిస్ట్ వద్ద ఇద్దరు హిజ్రాలు డబ్బులు బలవంతంగా లాక్కుని పరారయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. పుల్లేటికుర్రు పంచాయతీ పరిధి వీవర్స్ కాలనీకి చెందిన చింతా సత్యవెంకట అచ్యుతరాజేంద్రప్రసాద్ మంగళవారం అమలాపురం కిమ్స్ ఆసుపత్రి నుంచి మొసలపల్లి మీదుగా తన మోటారు సైకిల్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈ సమయంలో మొసలపల్లి నుంచి చింతాలమ్మ ఆలయానికి వెళ్లే దారిలో ఇద్దరు హిజ్రాలు రాజేంద్రప్రసాద్‌ను ఆపి డబ్బులు ఇవ్వాలని అడిగారు. అయితే తన వద్ద డబ్బులు లేవని ఫోన్‌పే చేస్తానని చెప్పి సెల్ తీసేందుకు ప్రయత్నించాడు. రాజేంద్రప్రసాద్ జేబులో రూ.4 వేలు కనిపించడంతో అతనిపై దౌర్జన్యం చేసి లాక్కుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.



ముంపునకు గురైన అప్పనపల్లి- ఉచ్చులవారిపేట రోడ్డు



ముక్తేశ్వరం- అయినవిల్లిలంక కాజ్‌వే వద్ద అగ్నిమాపక, పోలీస్ సిబ్బంది



అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలో గోదావరి పాయపై కాజ్ వే వద్ద వరద ఉధృతి

మూడోసారి ముంచేస్తోంది

- ఉధృతంగా ప్రవహిస్తోన్న నదీపాయలు
- వరదనీట రహదారులు
- పడవలపైనే ప్రయాణాలు

పి.గన్నవరం: గోదావరి మరోసారి ముంచేసింది.. వశిష్ఠ, వైనతేయ, గౌతమీ నదీపాయల వద్ద ఉధృతంగా మారింది. పలు లంక గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. ఈ ఏడాది మూడో సారి వరదలు రావడంతో లంక గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. బుధవారం ఉదయం నుంచి కె.ఏనుగుపల్లి రహదారిపై మూడు అడుగుల ఎత్తులో వరదనీరు ప్రవహిస్తోంది. చాకలిపాలెం శివారులోని పశ్చిమ గోదావరి జిల్లా కనకాయలంక కాజ్‌వే మళ్లీ వరదనీట మునగడంతో అక్కడ పడవలను పెట్టారు. మానేపల్లి శివారు శివాయలంకకు వెళ్లే రహదారి రెండు కిలోమీటర్ల మేర నీట మునగడంతో ఉదయం ట్రాక్టర్లు ఏర్పాటు చేశారు. వరద ఉధృతి పెరగడంతో వాటిని ఆపేశారు. అక్కడ బోట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. పల్లిపాలెం రహదారి కూడా నీట మునిగింది. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాల ప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. అయితే జి.పెదపూడి ఏటిగట్టు నుంచి బూరుగులంకకు వెళ్లే సీసీ రోడ్డు నీట మునడంతో నడుంలోతు నీటిలో వెళ్తున్నారు. మన జిల్లాకు సరిహద్దులో ఉన్న అయోధ్యలంక, పెదమల్లంక, సిర్రావారిలంక, ఆనగర్లంక ప్రజలు పడవలపైనే వెళ్తున్నారు. లంకల్లోని పశువులను ఏటిగట్లపైకి తరలించారు. ఊడిమూడిలంక ఏటిగట్టు దిగువన ఉన్న సంచార జాతుల కుటుంబాల వారు ఏటిగట్టును ఆశ్రయించారు. మండలంలోని వరద ముంపు ప్రాంతాలను కొత్తపేట ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ పరిశీలించారు. మానేపల్లి శివారు శివాయలంక, పల్లిపాలెం, బూరుగులంక గ్రామాల్లో ప్రజలతో మాట్లాడారు. అలాగే ముంపు గ్రామాల్లో పి.గన్నవరం తహసీల్దార్ శ్రీపల్లవి, ఎంపీడీఓ భారతి పర్యటించారు.

మామిడికుదురు మండలంలో..

మామిడికుదురు: పాశర్లపూడి ఏటిగట్టు దిగువనున్న అప్పనపల్లి కాజ్‌వే ముంపు బారిన పడింది. ఇటుగా రాకపోకలను నిషేధించారు. కాజ్‌వేకు రెండు వైపులా ఎన్‌డీఆర్‌ఎఫ్, పోలీసులను కాపలా పెట్టారు. కాజ్‌వే ముంపుతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మామిడికుదురు శివారు కొర్లగుంట నుంచి అప్పనపల్లి ఉచ్చులవారిపేట మీదుగా వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రోడ్డుపై మూడడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. వరద నీటిలో తీవ్ర ఇబ్బందుల నడుమ స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ మార్గంలో భారీ వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేక చిన్న వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు. గురువారం నాటికి పరిస్థితి మరింత జఠిలంగా మారే పరిస్థితులు ఉన్నాయి. వాహన రాకపోకలు నిలిచిపోయి కేవలం ట్రాక్టర్ ద్వారానే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉంది. పెదపట్నం గ్రామాన్ని కూడా వరద నీరు ముంచెత్తింది. పాశర్లపూడిబాడవలో పల్లవపాలెం కాలనీతో పాటు పాశర్లపూడిలంక శ్రీరామ్‌పేటను వరద నీరు ముంచెత్తింది. గోదావరి వరద పోటెత్తడంతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశుగ్రాసం ముంపు బారిన పడడంతో మూగ జీవాల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. వరద బాధితులకు సేవలందించేందుకు 25 మంది సభ్యులతో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం మామిడికుదురు చేరుకుంది. వరద పరిస్థితిపై ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి సమీక్ష చేశారు. ఆయన తహసీల్దార్ మృత్యుంజయరావుతో కలసి అప్పనపల్లిలో పర్యటించారు. అక్కడ నూతనంగా నిర్మించిన వారధిని పరిశీలించారు. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పెదపట్నం గ్రామాలతో పాటు పాశర్లపూడి, పాశర్లపూడిబాడవ మత్స్యకార ప్రాంతాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్ఐ అలీ తదితరులు ఉన్నారు.



బూరుగులంక రేవులో పడవపై వస్తున్న లంక గ్రామాల ప్రజలు

లోతట్టు ప్రాంతాలను చుట్టేసిన వరద

సఖినేటిపల్లి: ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక నేపథ్యంలో మండలంలో అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం గ్రామాల పరిధిలోని లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు, నివాస గృహాలు, కొబ్బరి తోటలను వరద నీరు చుట్టేసింది. దీంతో అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం సరిహద్దులో గోదావరి పాయపై కొత్తగా నిర్మించిన కాజ్ వే ద్వారా రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే గోదావరి పాయను ఆనుకుని టేకిశెట్టిపాలెం వైపు ఉన్న అగ్నికుల క్షత్రియ కాలనీకి వరద నీరు పోటెత్తింది. టేకిశెట్టిపాలెం ఆంజనేయస్వామివారి ఆలయం వైపునకు కూడా నీరు చేరింది. సఖినేటిపల్లి లాకుపేటలోకి గోదావరి పాయ మీదుగా నీరు వచ్చింది. అప్పనరామునిలంక, సఖినేటిపల్లి సరిహద్దులో గోదావరి పాయపై గతంలో నిర్మించిన మరో కాజ్‌వే కూడా ముంపులో చిక్కుకుంది. వరద ఉధృతి కారణంగా మాధవాయిపాలెం ఫెర్రీగా ప్రభుత్వ గుర్తింపు పొందిన సఖినేటిపల్లి, నరసాపురం రేవులో పంటు రాకపోకలను అధికారులు తాత్కాలికంగా నిలుపుదల చేశారు.

పోటెత్తుతున్న వరద

ఆలమూరు: మండలంలోని లంక ప్రాంతాల వెంబడి గౌతమీ గోదావరికి వరద పోటెత్తుతుంది. బడుగువానిలంక, మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల, జొన్నాడ, ఆలమూరు గ్రామాల్లోని రైతులు అప్రమత్తమయ్యారు. తమ వ్యవసాయ సామగ్రిని బయటకు తరలిస్తున్నారు. పశువులను రక్షణ ప్రదేశాలకు తీసుకువెళుతున్నారు. ఎస్సై ఎం.అశోక్, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ నేతృత్వంలో రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసు శాఖ అధికారులు లంక ప్రాంతాల వెంబడి పర్యటించి వరద పరిస్థితిని సమీక్షించారు. అవసరమైతే పునరావాస శిబిరాలను ఏర్పాటు చేస్తామని అధికారుల బృందం పేర్కొంది.

కాజ్‌వేపై చేరిన వరదనీరు

అయినవిల్లి: ముక్తేశ్వరం- అయినవిల్లిలంక ఎదురుబిడెం వద్ద కాజ్‌వేపై నాలుగు అడుగుల మేర వరదనీరు ప్రవహిస్తుంది. అక్కడ ప్రజల రాకపోకల కోసం పడవలు ఏర్పాటు చేశారు. వరద ఉధృతికి ముక్తేశ్వరం వృద్ధ గౌతమిపాయలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. అయినవిల్లిలంక, వీరవల్లిపాలెం, మడుపల్లిలంక, పొట్టిలంక, కొండుకుదురు లంక, తొత్తరమూడిలోని కె.పెదలంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లోకి వరదనీరు చేరింది. కూరగాయలు, అరటి, కోకో, తమలపాకుల పంటలు నీట మునిగాయి. ముక్తేశ్వరం- అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని ఎంపీ హరీష్ మాధుర్ పరిశీలించారు. వరద సహాయక చర్యలపై అధికారులను ఆరా తీశారు.

అంబాజీపేట: వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. ముంపు గ్రామాలైన వాకలగరువు, తొండవరం, నందంపూడి శివారు బొంతువారిపేటను ఆమె పరిశీలించారు. నందంపూడి బొంతువారిపేటలో కౌశికకు ఆనుకుని ఉన్న డ్రైన్ నుంచి వరద నీరు చేరుతుందని అన్నారు. ముంపు ప్రాంతాలను తహసీల్దార్‌తో పాటు ఆర్ఐ ఎండీ.ఇబ్రహీం, వీఆర్వో శ్రీనివాస్ ఉన్నారు.



జి.పెదపూడిలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సత్యనారాయణ



అప్పనపల్లి కొర్లగుంట వంతెన వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఆర్డీఓ కేశవవర్ధన్‌రెడ్డి

ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు



వాడపాలెంలో డీవీ, రత్నశ్రీలను సత్కరిస్తున్న రాజు తదితరులు



సత్యహరిశ్చంద్ర వారణాసి ఘట్టంలో డీవీ, రత్నశ్రీ, విజయరాజు

కొత్తపేట: వాడపాలెంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకూ సాగిన వివిధ నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దీనికి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి అనేక మంది కళాభిమానులు తరలివచ్చారు. ఇక్కడి చిన్న వంతెన సెంటర్ గణపతి నవరాత్ర ఉత్సవ పందిరిలో కళాపోషకుడు గొలకోటి రాజు ఆధ్వర్యంలో సింగిరెడ్డి గోవిందుస్వామి, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో మంగళవారం రాత్రి కురుక్షేత్రం, దేవనర్తకి, సత్యహరిశ్చంద్ర నాటకాల్లో ప్రధాన ఘట్టాల ప్రదర్శనలు నిర్వహించారు. సత్యహరిశ్చంద్ర వారణాసి ఘట్టంలో అభినవ హరిశ్చంద్రునిగా దక్షిణాది రాష్ట్రాల్లో రంగస్థల రారాజుగా ఖ్యాతి ఘడించిన జూ డీవీ సుబ్బారావు (ప్రకాశం జిల్లా వేట్లపాలెం), అభినవ చంద్రమతిగా పేరొందిన రత్నశ్రీ (కడప), నక్షత్రకునిగా షణ్ముఖి విజయరాజు (తణుకు) తదితరులు, అదే నాటకం కాటి సన్నివేశంలో హరిశ్చంద్రునిగా కృష్ణచైతన్య, చంద్రమతిగా రత్నశ్రీ, దేవనర్తకి నాటకంలో భవాని సన్నివేశంలో భవానీశంకరునిగా జూ డీవీ, చింతామణిగా రత్నశ్రీ, కురుక్షేత్రం నాటకం దుర్యోధనుడి మయసభ ఏకపాత్రాభినయంలో దంపూరి దుర్గాప్రసాద్ (తణుకు) తమ నటనా కౌశలాన్ని ప్రదర్శించారు. పై ప్రదర్శనల కళాకారులను ప్రోగ్రాం నిర్మాత గొలకోటి రాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సత్కరించారు. ప్రధానంగా గతంలో పాడిన శృతులను మించి పాడి మెప్పించిన జూనియర్ డీవీని కరెన్సీ నోట్ల దండలతో సత్కరించారు. మిగిలిన కళాకారులను సన్మానించారు. రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, సర్పంచ్‌లు త్సామా బాబు, నెల్లి లక్ష్మీపతిరావు, నిర్వహణ కమిటీ సభ్యులు, కళాప్రోత్సాహకులు సింగిరెడ్డి గోవిందుస్వామి, చీకట్ల నాని, గాదం శ్రీను, బాపట్ల శ్రీను పాల్గొన్నారు.

నేడు కొత్తపేటలో నాటక ప్రదర్శనలు

కొత్తపేట: స్థానిక కళానగర్ సిద్ధివినాయకస్వామి ఆలయం వద్ద గణపతి నవరాత్ర ఉత్సవ మండపంలో గురువారం రాత్రి కురుక్షేత్రం, సత్యహరిశ్చంద్ర పౌరాణిక రంగస్థల నాటకాల్లోని వివిధ ఘట్టాల ప్రదర్శనలు ఉంటాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

వరద బాధితులకు సాయం



వెంకటరెడ్డి కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న వీఓఏల సంఘ ప్రతినిధులు

పి.గన్నవరం: కృష్ణా జిల్లాలో వరద బాధిత పాడి రైతులకు నియోజకవర్గ టీడీపీ శ్రేణులు సమకూర్చిన 6 లారీల ఎండు గడ్డి, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు వ్యాన్ల పశువుల దాణా బస్తాలను బుధవారం విజయవాడకు పంపారు. వీటిని ఎంపీ జి.హరీష్ మాధుర్ పి.గన్నవరంలో జెండా ఊపి ప్రారంభించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: మండల సమాఖ్య ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు మలికిపురం వీఓఏలు సమకూర్చిన రూ. 8,500 సాయాన్ని డీఆర్‌డీఏ పీడీకి అందించారు. మమ్మిడివరం వీవోఏ బడుగు వెంకటరెడ్డి అనారోగ్యంతో చనిపోయారు. అతని కుటుంబానికి రూ. 10 వేలను అందించారు. ఏపీఎం వరాలబాబు, సీసీ నాగరాజు, రాజోలు తాలూకా వీఓఏ సంఘం అధ్యక్షురాలు ఎం.మంగాదేవి, సువర్ణ, నాగలక్ష్మి, కుమారి, సత్యవతి, నాగమణి, హైమ, సాయికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వద్దు



వక్కలంకలో రోగులకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ రేవతి

అంబాజీపేట: ప్రస్తుతం డెంగీ, మలేరియా జ్వరాలు వ్యాప్తిస్తున్నాయని, వాటిని నిర్లక్ష్యం చేయవద్దని సర్పంచ్ వాసంశెట్టి రేవతి, వైఎస్సార్ సీపీ నాయకుడు వాసంశెట్టి పెదబాబు అన్నారు. వక్కలంకలో జరుగుతున్న ఫీవర్ సర్వేను బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు రోజుల పాటు జ్వరం, దగ్గు, జలుబు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి దోమల నివారణకు సహకరించాలన్నారు. నివాస ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. అనంతరం రోగులకు సర్పంచ్ రేవతితో పాటు వైద్య సిబ్బంది ఏఎన్‌ఎం, ఆశాలు అవగాహన కల్పించారు.

అంబాజీపేట: వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు అన్నారు. గంగలకుర్రులో పారిశుధ్య పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈఓపీఆర్డీ బి.మమత, పంచాయతీ కార్యదర్శి ఎస్.సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి హోమం

మామిడికుదురు: గణపతి నవరాత్రుల్లో భాగంగా మామిడికుదురు నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద బుధవారం గణపతి హోమం నిర్వహించారు. యాలి రాంబాబు, సుహాసిని దంపతులు హోమంలో కర్తలుగా పాల్గొని పూజలు చేశారు. హోమం అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన జరిగింది. అదే గ్రామంలోని ఉన్నత పాఠశాల రోడ్డులో శ్రీలక్ష్మీగణపతి ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు.

అంబాజీపేట: మండలంలోని అన్ని వినాయక మండపాల వద్ద పెద్ద ఎత్తున పూజలు చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వెనుక సత్తెమ్మ తల్లి గుడి వద్ద బాలగణపతి నవరాత్ర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్వామి వారికి లక్ష గరిక పూజ చేశారు. అనంతరం మండపం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్వామివారి లడ్డూను మంచిగంటి శ్రీను రూ.4 వేలకు వేలంలో దక్కించుకున్నారు.



గణపతి హోమం చేస్తున్న రాంబాబు దంపతులు

పి.గన్నవరం: స్థానిక పితానివారిపాలెంలో శ్రీఆంజనేయ యూత్, శ్రీకోదండరామ యువజన సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి పందిరిలో అన్న సమారాధన చేశారు. తొలుత స్వామివారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

అంతర్వేదికి పవిత్రాలు

సఖినేటిపల్లి: అహోబిలం శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసిన పవిత్రాలు బుధవారం అంతర్వేది దేవస్థానానికి అర్చకులు చేర్చారు. అంతర్వేది ఆలయంలో ఈ నెల 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహించేందుకు ఇప్పటికే అర్చకులు, ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. దీనికోసం అహోబిలంలో పూజలు చేసిన పవిత్రాలను తీసుకువచ్చారు. ప్రజలకు ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలగాలని పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

అధ్యాపకులు, విద్యార్థుల ధర్నా



మలికిపురంలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

మలికిపురం: స్థానిక ఎంవీఎన్ జేఎస్ అండ్ ఆర్వీఆర్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులకు ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మలికిపురం ప్రధాన రహదారిపై బుధవారం ఆందోళన చేశారు. కొంతమంది వేసిన కేసుతో కోర్టు పరిధిలో ఈ వ్యవహారం ఉండగా, అటు ప్రభుత్వపరం కాక ఇటు ప్రైవేట్ పరం కాక మధ్యలో విద్యార్థులు ఇబ్బందులు పడుతూ ఫీజులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన చేశారు. దీనిపై యాజమాన్యం న్యాయం చేయాలంటూ విద్యార్థులు, అధ్యాపకులు, సామాజిక సంఘాల నాయకులు నిరాహార దీక్ష చేశారు. ఆందోళన నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ యాజమాన్యంతో మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు కళాశాల యాజమాన్యంతో చర్చించి చర్యలు తీసుకుంటామని కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యనారాయణ మూర్తి చెప్పారు. ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి రాము, జెడ్పీటీసీ సభ్యురాలు బళ్ల ప్రసన్నకుమారి, విశ్వేశ్వరాయపురం సర్పంచ్ చెల్లుబోయిన హెలినా, గెద్దం తులసి భాస్కరరావు, చింతా రాజబాబు, సరెళ్ల విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

సామూహిక సీమంతాలు



పెదపళ్లలో గర్భిణులకు సీమంతాలు చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆలమూరు: గర్భిణులకు చేస్తున్న సీమంతాలు తెలుగు సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని కొత్తపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పి.శారద అన్నారు. పెదపళ్ల కమ్యూనిటీ హాలులో బుధవారం గర్భిణులకు సీమంతాలు జరిగాయి. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టీఎస్‌వీ నాగలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు నిర్వహించిన సామూహిక సీమంతాలు కార్యక్రమానికి వ్యాపారవేత్త జాస్తి వెంకటేశ్వరరావు సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 15 మంది గర్భిణులకు నూతన వస్త్రాలు, పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, మిఠాయిలు బహూకరించారు. సర్పంచ్ యేడిద సత్యశ్రీ, మాజీ సర్పంచ్ గారపాటి త్రిమూర్తులు, గారపాటి శ్రీనివాస్, సలాది నాగేశ్వరరావు, అల్లూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.